**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 12.06.2024** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. 18వ లోక్ సభ తొలి సమావేశం ఈనెల 24వ తేదీన ప్రారంభమవుతుంది.
2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొద్ది సేపటి క్రితం ప్రమాణ స్వీకారం చేశారు.
3. ఖమ్మం, ఆలేరు నియోజకవర్గాల్లో ముంపు సమస్యలు నివారించేందుకు మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ ను నిర్మిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.
4. రాష్ట్ర వ్యాప్తంగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈరోజు పున: ప్రారంభమయ్యాయి.

------------

**PARLIAMENT:**

18వ లోక్ సభ తొలి సమావేశం ఈనెల 24వ తేదీన ప్రారంభమవుతుంది. ఈ సమావేశం సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడం, స్పీకర్ ఎన్నిక, రాష్ట్రపతి ప్రసంగం, చర్చ ఉంటాయి. ఇది ఇలా ఉండగా రాజ్యసభ 264 వ సమావేశం ఈనెల 27వ తేదీన ప్రారంభమవుతుంది పార్లమెంట్ సమావేశాలు వచ్చే నెల మూడో తేదీన ముగుస్తాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయం తెలియజేస్తూ దేశ ప్రజలు తమ తీర్పు ఇచ్చారని ఇక దేశ సేవ చేయడమే తమ కర్తవ్యమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల ఆశయాల గురించి చర్చించి, చర్యలు తీసుకుని నెరవేర్చేందుకు పార్లమెంట్ అత్యుత్తమమైన వేదిక అని ఆయన అన్నారు. (NSD)

----------------

**చంద్రబాబు ప్రమాణం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొద్ది సేపటి క్రితం ప్రమాణ స్వీకారం చేశారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరిపల్లి ఐటీ పార్కులో గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. మరో 23 మంది శాసన సభ్యులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున 20 మంది, జనసేన నుంచి పవన్ కల్యాణ్ సహా ముగ్గురికి, బీజేపీ తరపున ఒకరికి మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, రాందాస్ అథవాలే, జీతిన్ రాం మాఝీ, అనుప్రియ పటేల్, బండి సంజయ్, కె.రామ్మోహన నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస వర్మ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి. పురందేశ్వరి, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళి సై

సౌందరరాజన్, సినీ నటులు రజనీకాంత్, రాష్ట్ర అతిథిగా చిరంజీవి, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల దౌత్యవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
డెస్క్....అల్లు మురళి/విజయవాడ

----------------

**పొంగులేటి..మున్నేరు**

దశాబ్దాలుగా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న మున్నేరు వాగు ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా ఆర్‌సిసి రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ముంపునకు గురవుతున్న కాలనీల రక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. మున్నీరు పరీవాహక ప్రాంతంలో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మున్నేరు నదికి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉన్నందున వీలైనంత తొందరగా పనులను పూర్తి చేయాలని సూచించారు.
పీటీసీ....ఖమ్మం

----------------

గద్వాల...రాజనరసింహ

గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో అపరిష్కృతంగా ఉన్న అంశాలను సత్వరం పరిష్కరించాలని ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ జిల్లా చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. గద్వాలలో 300 పడకల ఆసుపత్రి, అలంపూర్ 100 పడకల ఆసుపత్రిలో సిబ్బంది నియామకం, జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల, ప్రజారోగ్య కేంద్రాల అభివృద్ధి తదతర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ వినతి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. పీటీసీ...జోగులాంబ గద్వాల

----------------

**TELANGANA-HORTICULTURE**

2047 నాటికి దేశం 30 లక్షల కోట్ల డాలర్ల స్థూల దేశీయోత్పత్తికి ఎదగడానికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని తెలంగాణ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ కోరారు. సహజ, సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందని చెప్పారు. నిన్న సిద్దిపేట జిల్లా ములుగులో జరిగిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవంలో గవర్నర్ మాట్లాడుతూ... దేశంలోని 70 శాతానికి పైగా గ్రామీణులకు వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరుగా ఉందని, 82 శాతానికి పైగా మంది చిన్న, సన్నకారు రైతులేనని, వ్యవసాయంతో పాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి గవర్నర్ ప్రస్తావించారు. NSD

----------------

**టెట్**

TG TET - టెట్ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. మొదటి పేపర్ లో 67.13 శాతం, రెండవ పేపర్ లో 34.18 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోలిస్తే మొదటి పేపర్ లో 30.24 శాతం, రెండవ పేపర్ లో 18.88 శాతం అర్హత పెరిగింది. పిఎన్

----------------

**గనులు...భట్టి**

రాష్ట్రంలో గనుల శాఖ ద్వారా ఆదాయాన్ని పెంచే మార్గాలు అన్వేషించాలని, ఇసుక, గనుల తవ్వకాలకు సంబంధించి వార్షిక క్యాలెండర్ రూపొందించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వార్షిక క్యాలెండర్ తయారీ తరువాతే టెండర్లు పిలవాలని అన్నారు. ఇసుక రీచ్ ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు

ప్రజలకు ఇసుక అవసరమైనంత మేర అందుబాటులో ఉండాలని నిన్న గనుల శాఖపై జరిగిన సమీక్షా సమావేశంలో అన్నారు. ఇసుక రీచ్ లను మహిళా సంఘాలకు అప్పగించే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. గోదావరి నదీ తీరంలో పట్టా భూముల పేరిట ఇష్టారీతిన సాగుతున్న ఇసుక తవ్వకాలపై నిఘా పెట్టాలని అదేశించారు. పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తదితరులు హాజరయ్యారు. డెస్క్

----------------

**పాఠశాలలు**

వేసవి సెలవులు అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు ఈ రోజు పునః ప్రారంభమయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 45 నిమిషాల వరకు పనిచేస్తాయి. ఉన్నత పాఠశాల తరగతులు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమవుతాయి. విద్యా సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్ కూడా విడుదలైంది. కాగా ఈ నెల 6 ప్రారంభమైన బడిబాట కార్యక్రమం ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుంది.

ఇలా ఉండగా, పాఠశాలల బస్సుల తనిఖీలు పకడ్బందీగా ఉండాలని, ఫిట్ నెస్ ఉన్న బస్సులనే రోడ్డుపైకి అనుమతించాలని సైబరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదేశించారు. డెస్క్

----------------

**పాఠశాలలు నల్గొండ**

నల్గొండ జిల్లాలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈవేళ పున ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నల్గొండ లోని బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ దాసరి హరిచందన విద్యార్థినులకు యూనిఫామ్ లు పంపిణి చేశారు. పిల్లలను బడిలో చేర్పించేందుకు ఈనెల 6న చేపట్టిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాలు ఇచ్చిందని ఆమె చెప్పారు. పిటిసి నల్గొండ

----------------

**పాఠశాల సూర్యాపేట**

పాఠశాలల పున ప్రారంభాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా మునగాల జిల్లా పరిషద్ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ వెంకట్రావ్ పుస్తకాలు, యూనిఫామ్ లు ఉచితంగా పంపణి చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిటిసి, సూర్యాపేట

----------------

**వరంగల్ కొండా సురేఖ**

రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ సాయంత్రం వరంగల్ లో పర్యటిస్తారు. నైరుతి రుతుపవనాల నేపథ్యంలో విపత్తు నిర్వహణ, వరద నివారణ కోసం కార్యాచరణ ప్రణాళికపై కుడా కార్యాలయంలో ప్రసంగిస్తారు. పోర్ట వరంగల్ లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. పీటీసీ....వరంగల్

----------------

**జాబ్ మేళ**

సిరిసిల్లలో రేపు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్ పి అఖిల్ మహాజన్ తెలిపారు.జిల్లాకు చెందిన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు పోలీస్ శాఖకు చెందిన లింక్ ద్వారా పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. సుమారు 60 కంపెనీల సహాయంతో వెయ్యికి పైగా ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పీటీసీ...రాజన్న సరిసిల్లా

----------------

**వాతావణం**

నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ లోని వాతావరణ శాఖ తెలిపింది. కొమరం భీం, మంచిర్యాల,

పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణ పేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలోభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. దీంతో ఆయా జిల్లాలను అప్రమత్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ లో అల్లూరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుతో పాటు రాయలసీమలోని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారయంత్రాంగం సూచించింది. డెస్క్

----------------

**సమాచార హక్కు**

రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్, కమిషనర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత ఏడాది జూలై 4న జారీ అయిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తు చేసిన వారు ఇప్పుడు తిరిగి దరఖాస్తు చేయనవసరం లేదని ఆ ఆ ప్రకటన తెలిపింది. ఇతర వివరాలకు WWW.telangana.gov. in లేదా tsic.gov.in వెబ్ సైట్లను సంప్రదించవచ్చు. డెస్క్

----------------